క్లుప్తంగా

స్థల పరిశీలన చేసిన ఆర్డీఓ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం గ్రామస్తులు దరఖాస్తు చేసిన విషయం తెలిసిందే. కాగా ఆర్డీఓ ఎస్.వెంకటేశ్ బుధవారం సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఐ సారంగపాణి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డ్యాగల సారయ్య, లక్ష్మారెడ్డి, వెంకటస్వామి, భిక్షపతి, సుధాకర్, ప్రేమ్‌రాజ్ ఉన్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన హెల్మెట్



పరకాల : పట్టణంలోని కనకదుర్గ ఆలయం సమీపంలో ఓ యువకుడు బైక్ అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు హెల్మెట్ ఉండడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. భూపాలపల్లి నుంచి హనుమకొండకు వెళ్తున్న క్రమంలో పట్టణంలోని కనుకదుర్గ ఆలయం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

నేడు భూమిపూజ

శాయంపేట : మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద షిర్డీ సాయిబాబా సత్సంగ్ మందిర నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించనున్నట్లు సాయిబాబా ట్రస్ట్ చైర్మన్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూమిపూజకు ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కమలాపూర్ : అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మండలంలోని 39 పాఠశాలల్లో రూ.1.90 కోట్లతో చేపట్టిన మౌలిక వసతుల కల్పన, పాఠశాలల అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ సీఈఓ బి.రవి ఆదేశించారు. మండలంలోని పంగిడిపల్లి, వంగపల్లి గ్రామాల్లో గల పాఠశాలలను ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ విమల, పీఆర్ ఏఈ మధుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల నగదు సీజ్

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం రాత్రి పోలీస్‌లు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఆసిఫాబాద్ జిల్లా ఒడ్డుగూడెంకు చెందిన ఎల్కరి సత్తయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.లక్ష 30 వేలు , గొర్రె చంద్రయ్య వద్ద నుంచి రూ.లక్ష 20వేలు, మంచిర్యాలకు చెందిన కొట్టె సమ్మయ్య వద్ద నుంచి లక్ష నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ క్రాంతికుమార్, ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

పదేళ్ల అభివృద్ధిని ప్రజలకు వివరిస్తాం



నయీంనగర్ : బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మళ్లీ కొబ్బరికాయలు కొడుతున్నారని, పదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్ముంటే నగర అభివృద్ధికి ఎవరు ఏం చేశారో చెప్పేందుకు భద్రకాళీ అమ్మవారి సాక్షిగా చర్చకు సిద్ధమా..అని సవాల్ విసిరారు. నాలుగు నెలల్లో మీరు తెచ్చిన నిధులెన్నో బయటపెట్టాలని, అబద్ధపు ప్రచారాలను మానుకోవాలన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు చెన్నం మధు, ఇమ్మడి రాజు లోహిత, రాజు నాయక్, బొంగు అశోక్ యాదవ్, డి.విజయలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ రవి
- ఎంఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఎల్కతుర్తి : గోపాల్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ రాజ్‌కుమార్



వేలేరు : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



కమలాపూర్‌లో..



నడికూడలో..

కమలాపూర్ : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రవి అన్నారు. మండలంలోని ఉప్పల్, మర్రిపల్లిగూడెం, గుండేడు, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి గ్రామాల్లో డీఆర్డీఏ (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, సీసీలు కుమారస్వామి, మమత, శ్రీదేవి, సదాలక్ష్మి, మహేందర్, గ్రామ సమాఖ్యల అధ్యక్షురాళ్లు, వీఓఏలు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు, హమాలీలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఏఓ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో రైతు సేవా పరస్పర సహకార (ఎంఏసీఎస్) సంఘం ఆధర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు దామెర, కేశవాపూర్, చింతలపల్లి, తిమ్మాపూర్, కోతులనడుమ గ్రామాల్లో ఎల్కతుర్తి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మీనారాయణతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు 17శాతం తేమ వచ్చేంత వరకు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. ఏ గ్రేడు రకానికి 2,203, కామన్ రకానికి 2,183 ధర కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలం కొప్పూర్, కన్నారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఓ అజ్జల్‌పాషా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కల్యాణి, రోజా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని చౌటుపర్తి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం రమాదేవి బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2,203, రెండో రకానికి రూ.2,183 ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి, ప్రగతిసింగారం, కాట్రపల్లి, తహరాపూర్, మైలారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సొసైటీ సీఈఓ రాజమోహన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు డీసీసీబీ సూపర్‌వైజర్ రాజేష్, సిబ్బంది, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జయసుధ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. సీసీలు నిత్యానంద, అశోక్ పాల్గొన్నారు.

పూడికమట్టితో భూసారం పెరుగుతుంది

- ఎంపీడీఓ బాబు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : పూడికమట్టిని పంట పొలాల్లో పోసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుందని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. మండలంలోని వంగిడిపల్లిలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన చెరువు పూడికతీత పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాలు పెంపొందుతాయని అన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా ప్రతిరోజు ఉదయం 6 గంటలకే పనులు ప్రారంభించాలని, ప్రతిరోజు కనీసం నాలుగు, ఐదు గంటలు పని చేస్తే రూ.300 వరకు కూలీ పొందే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పనుల వద్ద వడదెబ్బ తగులకుండా నీడ సౌకర్యంతోపాటు తాగు నీటి వసతి కల్పించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కోసం అవసరమైన మెడికల్ కిట్లు అదుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో రైతులు తమ వ్యవసాయ భూముల్లో పండ్ల తోటలు పెంచుకునేందుకు అవకాశం ఉందని, ఆసక్తి గల రైతులు మామిడి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, మునగ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు పెంచుకోవాలని కోరారు. అదే విధంగా పశువులు ఉన్న రైతులు పశువుల షెడ్లు నిర్మించుకోవచ్చని, అందుకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

ఎల్కతుర్తి : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పంటలపై రూ.500బోనస్ ఎప్పుడు ప్రకటిస్తారో చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా రైతులకు పల్లి, టమాట, బబ్బెర, మినుము విత్తనాలను అందించాలన్నారు. నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా, ఎంఎస్పీ ద్వారా పక్క రాష్ట్రాల్లో రైతులకు కావల్సిన విత్తనాలు ఇస్తూ మద్దతు ధరను ముందుగానే నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై ఆరోపణలు చేయడమే మంత్రికి సరిపోతుందని ఆరోపించారు. రైతుల మీద నిజమైన ప్రేమ, పట్టింపు ఉంటే వెంటనే గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి ఎండుతున్న పొలాలను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఊసకోయిల కిషన్, రామోజు శ్రీనివాస్, వేణు, సాయి, అనీల్, అజిత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సాధికారతకు పాటుపడాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

వేలేరు : బాలికల సాధికారతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికల సాధికారతపై బేటీ బచావో–బేటీ పడావో అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల ఎస్ఓ స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలురతో సమానంగా బాలికలు ఎదగాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు, వాటి వినియోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ అధికారి స్వర్ణలత, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి మంద కృష్ణ

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



గీసుకొండ: 'మంద కృష్ణ ..సెంటిమెంట్‌ను రోల్ చేసి కడియం శ్రీహరిని మాదిగలకు దూరం చేయాలని రెచ్చగొట్టే విధంగా రాజకీయ కుట్రతో వ్యవహరిస్తున్నారు.. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకం ఆయనది' అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హనుమకొండలోని తన నివాసంలో పరకాల నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరిని మాదిగలకు వ్యతిరేకం అని మాట్లాడుతున్న మంద కృష్ణ ఆనాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న కడియం శ్రీహరి వద్దకు వెళ్లి ఏబీసీడీ వర్గీకరణ కోసం ప్రాధేయపడ్డారన్నారు. దీంతో కడియం అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించి, అసెంబ్లీలో తీర్మానం చేయించిన విషయాన్ని మంద కృష్ణ మరచిపోయినా, మాదిగ సమాజం మరచిపోదన్నారు. బీజేపీ ముసుగు వేసుకుని మాట్లాడుతున్న మంద కృష్ణ తీరును సమాజం గమనిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్న దొమ్మాటి సాంబయ్యకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుకున్నా అది రాజకీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా కుదరలేదని, అయినా ఆయనకు రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌ను బొంద పెట్టి.. బీజేపీని గెలువకుండా చేయాలని అన్నారు.

మా 'త్రయం' అభివృద్ధికి బాటలు వేసింది

గతంలో టీడీపీ పాలనలో కడియం, ఎర్రబెల్లి, తాను ముగ్గురం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేశామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సాగు, తాగునీటితో పాటు మౌళిక సదుపాయాల కల్పనకు బాటలు వేశామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, గీసుకొండ, పరకాల ఎంపీపీలు భీమగాని సౌజన్య, స్వర్ణలత, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ గాదె దయాకర్, గీసుకొండ మండల అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి

- డీఆర్డీఓ శ్రీనివాసరావు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్డీఓ

ఎల్కతుర్తి : మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు ప్రారంభమైన సందర్భంగా పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని డీఆర్డీఓ శ్రీనివాసరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా బుధవారం భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీని ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఎండాకాలం దృష్ట్యా కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆరోగ్య సుత్రాలపై అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలో సిబ్బంది అందిస్తున్న సేవలను తెలసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రహమాన్, డాక్టర్ రుబీనా, ఆరోగ్య విస్తరణ అధికారి కేఎస్ఎన్ స్వామి, సృజన, మౌనిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

ఆత్మకూరు : మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రేవూరి రణధీర్ అన్నారు. మండలంలోని హౌజ్‌బుజుర్గులో బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలంతా సోదరభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మండల అధ్యక్షుడు ఖాజా, కిసాన్ సెల్ అధ్యక్షుడు రేవూరి జయ్‌పాల్‌రెడ్డి, ఖాసీం, దామెర రాజు, షరీఫ్, మిరియాల కుమార్ , అజయ్, శ్రావణ్, కుమార్, సురేష్ , కరీం పాల్గొన్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎగితే లింగయ్య అన్నారు. రాజా యూత్ అధ్యక్షుడు మంగ రాజు ఆధ్వర్యంలో బుధవారం పెంచికలపేటలో దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలను నిర్వహించగా ఆయన పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రంలో నియంతృత్వ పాలన నుంచి విముక్తి సాధించి పోరాట స్ఫూర్తిని కలిగించారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛావాయువులు పీల్చుకునేందుకు, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓదెలు, రాజు, నితిన్, సందీప్, రజినీకాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపూర్ : విద్యుత్ తీగల కింద చెట్టుకొమ్మలు తొలగించేందుకు గురువారం నుంచి 12వతేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ రాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం దేశరాజుపల్లి, శనిగరం రూరల్, 5న గూడూరు, శ్రీరాములపల్లి రూరల్, 6న వంగపల్లి, గోపాల్‌పూర్, 7న వంగపల్లి, గూనిపర్తి, 8న మాదన్నపేట, కమలాపూర్ టౌన్, 10న గూడూరు, శనిగరం, 11న కమలాపూర్, గూనిపర్తి, 12న లక్ష్మీపూర్, కమలాపూర్ టౌన్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ధర్మపురం, మల్లక్‌పల్లి గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ 33 కేవీ ఫీడర్, పంథిని టౌన్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రమేష్, ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గర్మిళ్లపెల్లి, ఉడుతగూడెం, పంథిని గ్రామాల విద్యుత్ వినియోగదారులతో పాటు వ్యవసాయ కనెక్షన్లు కలిగిన వినియోదారులు సహకరించాలని కోరారు.

నియామకం

హసన్‌పర్తి : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్‌గా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి నియామకం అయ్యారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

- ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు



గ్రామకార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను సన్మానిస్తున్న అధికారులు

పరకాల : అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. 2024 సంవత్సరంలో ఉపాధిహామీ పనులను ప్రోత్సహించిన మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లను అధికారులు గురువారం సన్మానించి అభినందించారు. ఎంపీఓ భాస్కర్, ఏపీఓ ఇందిరాతో పాటు 10 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎస్సై మహేందర్

నెక్కొండ : విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఎస్సై మహేందర్ అన్నారు. మండలంలోని రెడ్లవాడలో గల రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్డీఎఫ్) హైస్కూల్‌లో బుధవారం పాఠశాల 18వ వార్షికోత్సవానికి ఎస్సై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్న ఆర్డీఎఫ్ పాఠశాల యాజమాన్యంను అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ చేరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

హన్మకొండ : హనుమకొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. మంగళవారం రాత్రి కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూల రాముగౌడ్, బీఆర్ఎస్ 60వ డివిజన్ అధ్యక్షుడు మట్టేపల్లి రామరాజు, యువ నాయకులు సూరజ్, అరవింద్, ప్రవీణ్ కుమార్ చారి, దిలీప్, మహేష్, ప్రవీణ్, భరత్, సుమంత్, గణేష్, శేఖర్, అశోక్, అభినయ్, కమల్, పి.భరత్, సుమంత్‌తో పాటు పలువులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ సమక్షంలో చేరగా ఆయన కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి అంకిత భావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, నాయకులు అభినవ్ భాస్కర్, పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్, మాచర్ల కుమార స్వామి, దొంగల కొమరయ్య, పి.రాజి రెడ్డి, రోకుల సతీష్ పాల్గొన్నారు.